క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

పెడన: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కాకర్లమూడి గ్రామ సచివాలయం పరిధిలోని కాకర్లమూడిపాలెంలో శుక్రవారం జరుగుతుందని వైఎస్సార్ సీపీ పెడన మండల కన్వీనర్ కొండవీటి నాగబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ హాజరై గడప గడపకు వెళ్లి స్థానికుల సమస్యలు తెలుసుకుంటారని చెప్పారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని పేర్కొన్నారు.

విలేజ్ విజిలెన్స్ కమిటీ సమావేశం

మోపిదేవి: ప్రతి రేషన్‌షాపు వద్ద విలేజ్ విజిలెన్స్ సమావేశాలు ఏర్పాటు చేసి తీర్మానం కాపీలను ఈ నెలాఖరులోగా రెవెన్యూ కార్యాలయంలో అందజేయాలని సివిల్ సప్లయిస్ డీటీ శ్రీనివాసరావు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రేషన్ డీలర్స్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇంటింటా పరిశీలించడంతో పాటు సరుకుల వివరాలు, నేమ్ బోర్డు వంటి 25 అంశాలపై సమావేశంలో చర్చించి తీర్మానాలు చేయాలని సూచించారు. ఆర్ఐ సునీల్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, డీలర్స్, ఎండీయూ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలపై అవగాహన



పులిగడ్డ(అవనిగడ్డ): ఉద్యాన పంటలకు ఇచ్చే సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా లాభాలు గడించవచ్చని ఉద్యానవన శాఖాధికారి ఎస్. రమేష్ అన్నారు. పులిగడ్డలో ఉద్యాన శాఖ, ఆత్మ సంయుక్త ఆధ్వర్యంలో ఉద్యాన పంటలపై రైతులకు అవగాహన కల్పించారు. ఘంటసాల కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ మంజువాణి మాట్లాడుతూ కొబ్బరి, ఆయిల్‌పాం తోటల పెంపకంలో ప్రభుత్వం అందిస్తున్న పలు పథకాలను వివరించారు. టమోటా, పసుపు, మిరప, అరటి పెంపకంలో యాజమాన్య పద్ధతులను తెలిపారు. సర్పంచ్ దాసరి విజయకుమార్, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, సచివాలయ వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అన్నసమారాధన



మోపిదేవి: దసరా ఉత్సవాల్లో భాగంగా మోపిదేవి బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహం వద్ద గురువారం అన్నసమారాధన నిర్వహించారు. గత 11 రోజుల పాటు విశేష పూజలు అందుకున్న దుర్గమ్మ తల్లి విగ్రహాన్ని శనివారం సమీపంలోని కృష్ణా నదిలో నిమజ్జనం చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. సుమారు వెయ్యిమందికి పైగా భక్తులు అన్న సమారాధనలో పాల్గొన్నారు.

గుండెపోటుతో సబ్ ఇంజనీర్ మృతి



ప్రసాద్ (ఫైల్)

చల్లపల్లి: విద్యుత్ శాఖ చల్లపల్లి సబ్ డివిజన్ కార్యాలయంలో డీఈఈ వద్ద సబ్ ఇంజనీరుగా విధులు నిర్వహిస్తున్న భూక్యా నాగ ఆంజనేయ ప్రసాద్ గుండెపోటుతో మృతిచెందారు. మోపిదేవి మండలం కాసానగర్‌లో జీవిస్తున్న ప్రసాద్ బుధవారం ఇంటి వద్ద గుండెపోటుతో మృతి చెందారు. గురువారం ప్రసాద్ భౌతిక కాయాన్ని విద్యుత్ శాఖ ఉయ్యూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ధారావతు కృష్ణనాయక్, అవనిగడ్డ డీఈఈ సుబ్రహ్మణ్యేశ్వరరావు, చల్లపల్లి మండల ఏఈఈ కన్నంరెడ్డి అరవింద్ కుమార్, సహోద్యోగులు సందర్శించి నివాళులర్పించారు. ప్రసాద్ మృతికి సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

మృతుని కుటుంబానికి బీమా మంజూరు

మోపిదేవి: ప్రభుత్వం అందిస్తున్న బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మోపిదేవి ఎస్‌బీఐ బ్రాంచి మేనేజర్ ఎం. రాజేష్ అన్నారు. మోపిదేవి దళితవాడలో 2023 మే 25న కొప్పుల కుమారి అనారోగ్యంతో మృతి చెందింది. నామినీ భర్త వెంకటేశ్వరరావు ఎకౌంట్‌కు ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై) పథకం కింద రూ. 2 లక్షలు జమ చేశామని చెప్పారు.

ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలు ప్రారంభం

గన్నవరం: ఆర్టీసీ గన్నవరం డిపోలో కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయని డిపో మేనేజర్ పి.శివాజీ తెలిపారు. రాష్ట్రంలోని 84 ముఖ్య పట్టణాల్లో కార్గో డోర్ డెలివరీ సదుపాయం ఉందన్నారు. ఈ సేవలను డిపో పరిధిలోని ప్రజలు వినియోగించుకోవాలని డీఎం కోరారు.

విత్తు నుంచి విక్రయం వరకు అండ

- ఈక్రాప్‌తో రైతులకు భరోసా
- పెడన నియోజకవర్గంలో 57,532 ఎకరాలకు ఈ క్రాప్ నమోదు
- 54,808 ఎకరాలకు ఈకేవైసీ
- నాలుగు రోజులు గ్రామ సభలు
- ఆర్‌బీకేలలో ముసాయిదా జాబితాల ప్రదర్శన



పెనుమల్లి రైతు భరోసా కేంద్రంలో ముసాయిదా జాబితాను ప్రదర్శిస్తున్న వీఏఏ శిరీష, రైతులు

పెడన: విత్తు నుంచి పంట విక్రయం వరకు రైతులకు అన్నివిధాలుగా అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఈ క్రాప్ నమోదును పకడ్బందీగా చేపట్టింది. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోతే బీమా ప్రీమియం చెల్లించకుండానే పరిహారం అందజేస్తోంది. మార్కెట్లో ధరలు పడిపోయిన సందర్భంలో మద్దతు ధర కల్పిస్తోంది. ఈ క్రాప్ ఆధారంగా వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తూ రైతులకు భరోసా ఇస్తోంది. ఇందుకోసం రైతులు ఈ క్రాప్‌తో పాటు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించాల్సి ఉంటోంది. పెడన నియోజకవర్గంలోని 31,505 మంది రైతులు 57,532 ఎకరాలను ఈ క్రాప్ చేయించుకున్నారు. ఈకేవైసీ 28,123 మంది రైతులు 54,808 ఎకరాలకు చేయించారు. ఇంకా 3,382 మంది రైతులు 2,724 ఎకరాలకు ఈకేవైసీ చేయించాల్సి ఉంది.

పకడ్బందీగా ఈ క్రాప్ నమోదు

గత ఏడాది పంటల నమోదులో అనేక జాగ్రత్తలు తీసుకున్నా అక్కడక్కడా పొరపాట్లు చోటు చేసుకున్నాయి. పొరపాట్లకు తావులేకుండా జియోఫెన్సింగ్‌తో ఎంపిక చేసుకున్న సర్వే నంబర్లలో ఫొటో తీసి ఈ క్రాప్ నమోదు చేశారు. వెబ్‌ల్యాండ్ డేటా లింకుతో ఎన్ఐసీ సహకారంతో వ్యవసాయ శాఖ రూపొందించిన యాప్ ద్వారా ఈ క్రాప్‌ను దిగ్విజయంగా సెప్టెంబర్‌లో పూర్తి చేశారు. ప్రస్తుతం ఈ క్రాప్ పూర్తికావడంతో సెప్టెంబర్ నుంచి ఈకేవైసీ ప్రారంభించింది. వంద శాతం పూర్తి చేయాలని వ్యవసాయ శాఖాధికారులు అహర్నిశలు శ్రమించినా అక్కడక్కడా చిన్నచిన్న రైతులు ముందుకు రాకపోవడం వల్ల వంద శాతం పూర్తికాలేదు. ఈ క్రాప్ చేయించుకున్న వారంతా తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని గ్రామాల్లో టాంటాం వేయించినా, గ్రామ సభల ద్వారా చెప్పినా కూడా వందశాతం రైతులు చేయించుకోకపోవడం కొద్దిగా ఆందోళన కలిగిస్తోంది. అయితే సదరు రైతులు ఉన్నారా లేదా అనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఈ క్రాప్ సమయంలో సదరు రైతులు లేకుండానే ఈ క్రాప్ పూర్తిచేయడం, ఈకేవైసీకి తప్పనిసరిగా ఫోన్ నంబరు కావాల్సి రావడంతో సదరు రైతులు ముందుకు రాలేదా అనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. అదీ కాకుండా వెబ్ ల్యాండ్‌లో ప్రతి సర్వే నంబర్‌కు రైతు ఆధార్, మొబైల్ నంబర్ అనుసంధానం చేయడంతో పాటు ఈ కర్షక్ యాప్‌కు ఆర్‌బీకేలు, రెవెన్యూ గ్రామాలను మ్యాపింగ్ చేశారు. ఈ యాప్‌లో రైతు ఆధార్ నంబరు నమోదు చేస్తే భూమి వివరాలు కనిపించేలా చేయడంతో రైతులు కొందరు ముందుకు రాలేదనే వాదన కూడా వినిపిస్తోంది.

నాలుగు రోజుల పాటు ఆర్‌బీకేలలో గ్రామ సభలు

గురువారం నుంచి ఈనెల 29వ తేదీ వరకు పెడన నియోజకవర్గంలోని 67 రైతు భరోసా కేంద్రాల్లో గ్రామ సభలు నిర్వహించేలా వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టింది. ఆర్‌బీకేలలో రైతులు చేయించుకున్న ఈ క్రాప్, ఈకేవైసీ వివరాల ముసాయిదా జాబితాలను ప్రదర్శించనున్నారు. ఈ జాబితాలను రైతులు చూసుకుని ఏమైనా అభ్యంతరాలు ఉంటే లిఖితపూర్వకంగా సంబంధిత వీఏఏ, ఎంపీఈఓల దృష్టికి తీసుకువెళ్లి సరిచేయించుకోవాల్సి ఉంటుంది. ఇదే ఫైనల్ అని వ్యవసాయ శాఖ పేర్కొంటోంది. ఈ జాబితా ప్రకారమే రైతులు ప్రభుత్వ పరంగా అందాల్సిన సబ్సిడీలు, నష్టపరిహారాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయాలు చేసుకునేందుకు అవకాశం ఉంటుంది.

నియోజకవర్గంలో ఈ క్రాప్, ఈకేవైసీ నమోదు ఇలా..

మండలం	రైతులు	ఈ క్రాప్ ఎకరాల్లో	రైతులు	ఈకేవైసీ ఎకరాల్లో
గూడూరు	9,861	18,964	8,423	17,913
పెడన	12,322	20,584	11,096	19,523
బంటుమిల్లి	6,923	12,835	6,283	12,362
కృత్తివెన్ను	2,399	5,149	2,321	5,010
మొత్తం	31,505	57,532	28,123	54,808

గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి



ఈక్రాప్, ఈకేవైసీ వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించాం. ఈ ఏడాది మరింత పకడ్బందీగా ఈ క్రాప్, ఈకేవైసీ చేపట్టాం. ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పంటలకు ఈ కర్షక్ యాప్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకున్నాం. రైతులు ఎక్కువగా ఉన్నారు. ఎకరాలు తక్కువగా ఉన్నాయి. కుంట, 40 సెంట్లు, 60 సెంట్లు పొలాలున్న రైతులు చేయించుకునేందుకు ముందుకు రాలేదు. ప్రస్తుతం గ్రామ సభలు పెట్టాం. ఇదే చివరి అవకాశం.

–శ్రీనివాసరావు, ఏఓ, పెడన

టిడ్కో గృహాల వద్ద పనులు పూర్తి చేయండి

ఎమ్మెల్యే పేర్ని నాని



టిడ్కో గృహ నిర్మాణాలను పరిశీలించి సూచనలిస్తున్న ఎమ్మెల్యే పేర్ని నాని

మచిలీపట్నంటౌన్: నగరంలోని గోసంఘం, రుద్రవరంలో నిర్మించిన టిడ్కో గృహాల వద్ద మౌలిక వసతుల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) సూచించారు. టిడ్కో గృహాల వద్ద మౌలిక వసతుల పనులను గురువారం ఎమ్మెల్యే పేర్ని నాని అధికారులతో కలిసి పరిశీలించారు. ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం, సబ్‌స్టేషన్ల నిర్మాణం తదితర పనుల తీరును ఆయన పరిశీలించారు. టిడ్కో ఏఈ ఎం. గణేష్‌బాబు పనుల పురోగతిని ఎమ్మెల్యే పేర్ని నానికి వివరించారు. గోసంఘం వద్ద టిడ్కో గృహాల నిర్మాణం పూర్తయిందని, ఓవర్‌హెడ్ ట్యాంకుకు సున్నం వేసే పనులు ప్రారంభిస్తున్నామని చెప్పారు. సబ్‌స్టేషన్ పనులు ప్రారంభమయ్యాయన్నారు. రివర్స్ టెండరింగ్‌లో రుద్రవరంలో టిడ్కో గృహాల నిర్మాణాన్ని కూడా పూర్తి చేశామని వివరించారు. అక్కడ కూడా ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం పూర్తయిందని, ఇతర పనులు జరుగుతున్నాయని వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పేర్ని నాని, హౌసింగ్ ఇన్‌చార్జి పీడీ జీవీ సూర్యనారాయణ, కమిషనర్ జి. చంద్రయ్య, కార్పొరేటర్ పరింకాయల విజయచంద్రకుమార్, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జీలు బడే భానుతేజ, చింతా మౌనిక, మునిసిపల్ డీఈలు వరప్రసాద్, సతీష్‌చంద్ర, పీఆర్ ఏఈ జవహర్ పాల్గొన్నారు.

పేదల ఆరోగ్య రక్షణే ధ్యేయం

మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ



శిబిరంలో వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న మేయర్ వెంకటేశ్వరమ్మ

మచిలీపట్నంటౌన్: రాష్ట్రంలోని పేదల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అడుగులు వేస్తున్నారని మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ అన్నారు. నగరంలోని 21, 32వ డివిజన్లలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాలను మేయర్ వెంకటేశ్వరమ్మ ప్రారంభించి మాట్లాడారు. పేదల ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా రోగాలను తగ్గించుకునేందుకు ఆస్పత్రులకు వెళ్లలేని పరిస్థితి ఉంటోందన్నారు. దీనిని గమనించిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా వైద్య సిబ్బందిని ఇంటింటికి పంపించి ఆరోగ్య పరీక్షలు చేయించి వైద్య శిబిరాల్లో వైద్యులతో పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా ఇస్తున్నారని తెలిపా. దీర్ఘకాల వ్యాధులతో బాధపడేవారు కార్పొరేట్ వైద్యశాలల్లో ఆరోగ్యశ్రీ కార్డుతో వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఇప్పటికి 44 డివిజన్లలో వైద్యశిబిరాలు పూర్తి చేశామన్నారు. మరో ఆరు డివిజన్లలో వైద్యశిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. శిబిరాల వద్ద పలువురు వైద్యులు రోగులకు పరీక్షలు చేసి మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, 21వ డివిజన్ కార్పొరేటర్ మన్నే శారదా, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జ్ మన్నే శేషారావు, 32వ డివిజన్ కార్పొరేటర్ చింతా వెంకటేశ్వరరావు, చింతా మౌనిక పాల్గొన్నారు.



పెడనలో రోగులకు మందులు అందజేస్తున్న నాయకులు

- పెడన: పెడన మండలం ఉరివి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. 601 మందికి వైద్య నిపుణులు ప్రదీప్‌కుమార్, సౌజన్య తదితరులు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వీరిలో 11 మందిని వివిధ శస్త్రచికిత్సలకు సిఫార్సు చేశారు. మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు రాజులపాటి అచ్యుతరావు, వైస్ ఎంపీపీ యాదంరెడ్డి వరప్రసాద్, పెనుమల్లి సర్పంచ్ గరికపాటి వెంకటరామానాయుడు, మండల కన్వీనర్ కొండవీటి నాగబాబు, ఎంపీటీసీ గంధం విజయలక్ష్మీ పాల్గొన్నారు.

3న ఎచీవ్‌మెంట్ సర్వే పరీక్ష

డీవైఈఓ సుబ్బారావు



మాట్లాడుతున్న డీవైఈఓ సుబ్బారావు

మచిలీపట్నంటౌన్: స్టేట్ ఎడ్యుకేషనల్ ఎచీవ్‌మెంట్ సర్వే పరీక్ష నవంబరు 3వ తేదీన ఇన్విస్టిగేటర్లు సమర్థవంతంగా నిర్వహించాలని మచిలీపట్నం డివిజన్ విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు సూచించారు. స్థానిక జార్జికార్నేషనల్ హైస్కూల్‌లో గురువారం ఎచీవ్‌మెంట్ సర్వే పరీక్ష నిర్వహణపై ఇన్విస్టిగేటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో తీసుకువచ్చిన పెనుమార్పులతో విద్యాప్రమాణాలు పెరిగాయన్నారు. గతానికి, ఇప్పటికీ విద్యారంగంలో ఎంతో మార్పులు వచ్చాయని చెప్పారు. ఈ మార్పులకు అనుగుణంగా విద్యార్థులు చదువులో ఎంతమేర రాణిస్తున్నారనే అంశాన్ని తెలుసుకునేందుకు నవంబరు 3వ తేదీన 3, 6, 9 తరగతుల విద్యార్థులకు ఎచీవ్‌మెంట్ సర్వే పరీక్ష నిర్వహిస్తారన్నారు. ఈ పరీక్ష ద్వారా విద్యారంగంలో వచ్చిన మార్పులతో విద్యార్థులు చదువులో ఎంతమేర అభివృద్ధి సాధించారో తెలుస్తుందని చెప్పారు. మచిలీపట్నం డివిజన్‌లోని 12 మండలాల్లో 442 సెంటర్లలో ఈ పరీక్ష జరుగుతుందన్నారు. బందరు ఎంఈఓ దుర్గాప్రసాద్, పలు మండలాల ఎంఈఓలు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం



మండవల్లి: మండలంలోని లింగాల హైస్కూల్‌లో పదో తరగతి చదివి శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో ఫ్రీ సీటు సాధించి మొదటి సంవత్సరం చదువుతున్న మకరం లక్ష్మినాగసురేంద్రనాయుడు అనే విద్యార్థికి సుధామ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రొఫెసర్ సుధాబత్తుల విజయ్‌కుమార్ రూ.10 వేల నగదును భాస్కరరావు భైరవపట్నంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, మండల అధ్యక్షుడు టి.అప్పారావు మాట్లాడుతూ సుధామ ఫౌండేషన్ సైన్స్‌పై అవగాహన కలిగించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎస్.సిద్ధార్థ, ఎం .అజిత్, సుధామ ఫౌండేషన్, ఐక్యవేదిక సభ్యులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి వేళ ఇరిగేషన్ అధికారుల పొలంబాట

సాగునీటి పరిస్థితి పరిశీలన



పిట్టల్లంక ప్రధాన పంట కాలువ వద్ద రైతులతో మాట్లాడుతున్న డీఈ రవికిరణ్

అవనిగడ్డ/కోడూరు: దివిసీమలోని తీర ప్రాంతాల్లో సాగునీటి ఇబ్బందులను తొలగించేందుకు ఇరిగేషన్ అధికారులు అర్ధరాత్రిళ్లు పొలంబాట పట్టారు. కోడూరు మండల పరిధి పిట్టల్లంక, సాలెంపాలెం, విశ్వనాథపల్లి గ్రామాల్లో బుధవారం అర్ధరాత్రి ఇరిగేషన్ డీఈ రవికిరణ్, హెడ్‌వర్క్ సెక్షన్ ఏఈ పులిగడ్డ వెంకటేశ్వరరావు కోడూరు, నాగాయలంక, అవనిగడ్డ ఏఈలతో కలిసి కోడూరు మండలంలోని పలు గ్రామాల్లో అర్ధరాత్రి పర్యటించి పంట కాలువలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. దిగువప్రాంతంలో రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని నాలుగున్నర రోజులకు వంతుల వారీ విధానాన్ని పెంచామని చెప్పారు. ఎగువ ప్రాంత రైతులు దిగువ ప్రాంత రైతులకు సాగునీరు పెట్టుకునేందుకు అవకాశం ఇవ్వాలని సూచించారు.

అమ్మవారి ప్రతిమ నిమజ్జనం



పెడనలో అమ్మవారి ప్రతిమను నిమజ్జనానికి తీసుకువెళుతున్న భక్తులు

పెడన: దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని 15వ వార్డులో మత్స్యకారులు నిలిపిన కనకదుర్గ అమ్మవారి ప్రతిమను గురువారం సాయంత్రం నిమజ్జనానికి తీసుకువెళ్లారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిగింది. సాయంత్రం మేళతాళాలతో అమ్మవారిని ఊరేగింపుగా తీసుకువెళ్లి పెడన రామరాజు కాలువలో నిమజ్జనం చేశారు.



బంటుమిల్లిలో అమ్మవారి ఊంజల సేవ

భక్తిశ్రద్ధలతో పవళింపు సేవ

బంటుమిల్లి: బంటుమిల్లి రామాలయంలో నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా అమ్మవారి పవళింపు సేవ జరిగింది. తొలుత ఉత్సవమూర్తులను పల్లకిలో ఉంచి ద్వాదశ ప్రదక్షిణలు చేశారు. అనంతరం పవళింపు సేవ నిర్వహించారు. పలువురు దంపతులు స్వామివారికి ఊంజల సేవ నిర్వహించారు.

ప్రకృతి వ్యవసాయ కూరగాయల విక్రయం



ముదినేపల్లిరూరల్: ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయలను స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద సిబ్బంది గురువారం విక్రయించారు. మండలంలోని బొమ్మినంపాడు, కొరగుంటపాలెం గ్రామాల్లో ప్రకృతి సేద్యంతో కూరలను పండించారు. వీటికి తోడు గిరిజన కార్పొరేషన్ నుంచి బెల్లం, పసుపు స్థానికంగా కొనుగోలు చేసి కూరలతో పాటు విక్రయాలు చేపట్టారు. వీటికి ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తున్నట్లు ప్రకృతి వ్యవసాయ డిజిటల్ సీఆర్పీ గౌతమ్‌కుమార్ అన్నారు. మాములు కూరల ధరలతో పోలిస్తే వీటి ధర కొంత ఎక్కువైనప్పటికీ ప్రజలు మంచి ఆదరణ చూపుతున్నట్లు తెలిపారు.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

కోనేరుసెంటర్: గుర్తుతెలియని వ్యక్తి వృద్ధురాలి మెడలో గొలుసు తెంపుకుపోయాడు. సీఐ సీహెచ్ సతీష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... మచిలీపట్నం నరసింహనగర్‌కు చెందిన వృద్ధురాలు మాఘపు నాగవేణి గురువారం తెల్లవారుజామున పూజకు పూలు తెచ్చుకునేందుకు రోడ్డుపై వెళుతుండగా గుర్తుతెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంపై వచ్చి ఆమె మెడలోని మూడు కాసుల బంగారు గొలుసును తెంపుకు పోయాడు. బాధితురాలు చిలకలపూడి పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ సతీష్ కుమార్ ఘటనా స్థలంలోని సీసీ పుటేజీలను పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగాలకు 54 మంది ఎంపిక



గుడివాడటౌన్: స్థానిక వీకేఆర్ అండ్ వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాలలో కోయాక్స్ డెవలప్‌మెంట్ టెక్నాలజీస్ మల్టీనేషనల్ కంపెనీ, టైడల్ పార్క్ చెన్నై ఆధ్వర్యంలో జరిగిన ఉద్యోగ ఎంపికలో 54 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కంపెనీ ప్రతినిధి ఎం.ధనుంజయరావు తెలిపారు. ఈ మేరకు ఎంపికైన విద్యార్థులకు నియామక పత్రాలను గురువారం అందజేశారు. కళాశాలలో ఫైనల్ ఇయర్ ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులు ఇంటర్వ్యూలో పాల్గొనగా 54 మంది ఎంపికయ్యారన్నారు. వీరికి ఏడాదికి రూ.5 లక్షలు వేతనం ఇస్తామని చెప్పారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వీ ప్రసాదరావు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎస్.నవీన్‌కుమార్ అభినందించారు.

బందరులో అనసూయ సందడి



వస్త్ర దుకాణాన్ని ప్రారంభించిన అనసూయతో మేయర్ వెంకటేశ్వరమ్మ తదితరులు

మచిలీపట్నంటౌన్: సినీ నటి అనసూయ భరద్వాజ్ గురువారం నగరంలో సందడి చేశారు. మునిసిపల్ కార్యాలయం పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన యువతి వస్త్ర దుకాణాన్ని మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మతో కలిసి ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనసూయ మాట్లాడుతూ చారిత్రక నగరమైన మచిలీపట్నం రావడం సంతోషంగా ఉందన్నారు. రాజకీయాల పట్ల ఆసక్తి లేదని, నా పేరు వాడుకోవడంపై ట్విటర్‌లో స్పందించానని చెప్పారు. తను చేస్తున్న సినిమాల గురించి వివరించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్ దాదా, దుకాణ నిర్వాహకులు, కురిచేటి నాగేశ్వరరావు, తాటికొండ బద్రీనాథ్, కొప్పు నూకేశ్వరరావు పాల్గొన్నారు.

సత్యనారాయణ స్వామి ఆలయంలో పూజలు



గుడివాడటౌన్: స్థానిక కోతిబొమ్మ సెంటర్‌లో వేం చేసి ఉన్న శ్రీ రమా సహిత వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో దేవస్థానం ట్రస్ట్, తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో భజన కార్యక్రమం గురువారం జరిగింది. హిందూ ధర్మ ప్రచార పరిషత్ నెలవారీ కార్యక్రమాల్లో భాగంగా ఆశ్వయుజ మాసాన్ని పురస్కరించుకుని శ్రీ మాతృశ్రీ భజన మండలి ఆధ్వర్యంలో భజనా కార్యక్రమం చేపట్టారు. అనంతరం రామాయణంపై వేద పండితులు బాల సుబ్రహ్మణ్యం ఉపన్యసించారు. కార్యక్రమంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యదర్శి కావూరి శ్రీధర్, ఆలయ అధ్యక్షురాలు గుదే లక్ష్మీ రంగనాయకమ్మ, కోశాధికారి మాదాసు వెంకట లక్ష్మీకుమారి, ప్రధాన అర్చకుడు వి.రామకృష్ణామాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

- పామర్రు: స్థానిక కొత్త పేటలోని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు నందిపాటి సాంబిరెడ్డి తండ్రి నందిపాటి వెంకటరెడ్డి(90) ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. గురువారం సాంబిరెడ్డిని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అధైర్య పడవద్దని, పార్టీ మీకు అన్ని విధాలా అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఉప సర్పంచ్ దేవిరెడ్డి బాల వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధికి కృషి

ఏపీ ఉర్దూ అకాడమీ కార్యదర్శి మస్తాన్ వలీ



రాష్ట్ర ఉర్దూ అకాడమీ కార్యదర్శి మస్తాన్ వలీని సత్కరిస్తున్న కమిటీ పెద్దలు

చల్లపల్లి: గ్రామంలోని చల్లపల్లి నారాయణరావు నగర్ కాలనీలో ముస్లింల శ్మశానవాటిక అభివృద్ధికి సహకరిస్తామని ఏపీ ఉర్దూ అకాడమీ కార్యదర్శి షేక్ మస్తాన్ వలీ అన్నారు. గురువారం చల్లపల్లి వచ్చిన మస్తాన్ వలీ, రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షేక్ దిల్‌షాద్ నజరానాతో కలిసి కాలనీలోని గౌసియా మస్జీదులో ముస్లిం పెద్దలతో సమావేశమయ్యారు. మస్జీదు కమిటీ అధ్యక్షులు ఎస్ఎంఏ షరీఫ్ మాట్లాడుతూ కాలనీ ముస్లింల కోసం ఊరి చివర ఏర్పాటు చేసిన ఖబరిస్తాన్ ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని తెలిపారు. ఖబరిస్థాన్ మెరక, ప్రహరీ, సీసీ రోడ్డు, నీటి వసతికి నిధులు కావాలని తెలిపారు. ఖబరిస్థాన్ మధ్యలో నుంచి వెళుతున్న విద్యుత్ లైన్ బయటకు మార్చాల్సి ఉందన్నారు. ఎలాంటి మౌలిక సౌకర్యాలు లేకపోవడంతో ఖనన క్రియలకు సమస్యగా మారిందని చెప్పారు. మస్తాన్ వలీ మాట్లాడుతూ నిధుల మంజూరుకు తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు కమిటీ పెద్దలు ఉర్దూ అకాడమీ డైరెక్టర్ నజరానాకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మస్తాన్ వలీని కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి అబ్దుల్ మతీన్, ముస్లిం పెద్దలు అబ్దుల్ కరీం, షేక్ నబీషోరీ, పఠాన్ కరిముల్లా ఖాన్, కుతుబ్‌షా, మహమ్మద్ సాహెబ్ పాల్గొన్నారు.